ప్రజాశక్తి

శనివారం 14 సెప్టెంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు



బాల్య వివాహాలతో అనర్ధాలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం . ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్ బాలామణిదేవి ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు.డ్రాప్ ఔట్స్ వివరాలు తీసుకుని కిషోర బాలికలు అందరికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఆర్ వెంకటరావు అన్నారు. బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యతని ఆయన గుర్తు చేశారు. ఎంఈఓ సోమేలి చెల్లయ్య మాట్లాడుతూ, స్కూల్స్ లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి బాల్యవివాహాలతో కలిగే నష్టాలపై అందరికి అవగాహన కల్పిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 ఈశ్వరరావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

చట్రాపల్లి బాధితులకు..

న్యాయం చేయాలి : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని జీకే వీధి మండలం చట్రాపల్లి గ్రామంలో బాధిత ఆదివాసీ కుటుంబాలకు యుద్ధప్రాతిపదికన ప్రత్యేక మోడల్ హౌసింగ్ కాలనీని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాడేరు సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అప్పల నరస మాట్లాడుతూ, బాధితులను ఆదుకుంటామని అంటున్నారే తప్ప స్పష్టమైన ప్రకటన ఇవ్వలేదన్నారు. గాయపడిన వారికి లక్ష రూపాయలు, ఇల్లు కోల్పోయిన వారికి 10లక్షలు మంజూరు చేయాలని, గ్రామానికి మోడల్ కాలనీ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. హుదూత్ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన మోడల్ కాలనీ గృహ ప్రవేశానికి కనీసం 10 సంవత్సరాలు పట్టిందని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు 10వేల ఎకరాల భూములు నష్టపోయారని, ముఖ్యంగా వరి, రాజ్మా, పసుపు, రాగి, కాఫీ పంట, మిరియాల పై ప్రభుత్వం ప్రత్యేక సర్వే నిర్వహించాలని కోరారు. తుపాన్ ప్రభావంతో ద్వసమైన సీలేరు రహదారి తో పాటు జిల్లా పరిధిలోని అనేక గ్రామాల్లో రోడ్, వంతెన, ఇల్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. ఒక్క జి. కె వీధి మండలం లోనే 32వేల మంది ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయన్నారు. జిల్లాలో తుపాన్ నష్టంపై ప్రత్యేక అధికార్ల బృందాన్ని ప్రభుత్వం నియమించి,నివేదిక అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ కూడా జిల్లా పరిధిలో కురిసే వర్షం పై అధికార యంత్రాంగంను అప్రమత్తం చేయలేదన్నారు. ముందస్తుగా ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసి ఉంటే రహదారి, విద్యుత్ వ్యవస్థ త్వరగా మరమ్మత్తు జరిగేదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ ఎక్కువ కావడంతో పర్యావరణ కాలుష్యం పెరిగిందని, వాతావరణలో మార్పులు ఆదివాసీలకు శాపాలుగా మారిందన్నారు.తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు భరోసా కల్పించడానికి పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పల నరస తో కూడిన బృందంలో జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు బి.చిన్నయ్య పడాల్, జి.కె వీధి, చింతపల్లి పార్టీ మండల కార్యదర్శి అపరంగి బుజ్జిబాబు, ధనుంజయ్, నాయకులు గడుతురి సత్యనారాయణ, బాలయ్య న్నారని తెలిపారు.గ్రామానికి వెళ్లిన బృందానికి బాధితులు ఆర్తనాధాలతో తమ గోడును వెలిబుచ్చారని పేర్కొన్నారు. అర్థ రాత్రి జరిగిన ఘటన కావడం తో గంట వ్యవధిలో 3 సార్లు కొండ చరియలు విరిగిపడి గ్రామానికి వరద రావడం తో తెరుకోలేక పోయామని చెప్పారన్నారు.పునరావాస కేంద్రాన్ని సందర్శించిన సిపిఎం జిల్లా బృందం సపర్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, రైతు భరోసా కేంద్రం లో ఏర్పాటు చేసిన తుపాన్ పునరావాస కేంద్రాన్ని పరిశీలించిందన్నారు. అధికార్లు ప్రకటన చేస్తున్నారే తప్ప స్పష్టత హామీ ఇవ్వడం లేదని, బాధితులు వివరించారని చెప్పారు. సి.పి.ఎం జిల్లా ప్రతినిధి బందం ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేసామని తెలిపారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఎల్ సుందరరావు, పాలికి లక్కు, చిట్టిబాబు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హుకుంపేట: గిరిజనులపై దాడికి పాల్పడుతున్న బుడ్డిగ కొండమ్మ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన మహిళలు గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారావు తెలిపారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు నీరుగారుస్తున్నారని ఆయన వాపోయారు. అధికారుల తీరు మారక పోతే తీవ్ర పరిణామాలు తప్పదని ఆయన అన్నారు. హుకుంపేట మండల కేంద్రంలో గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై ఆదివాసీ గిరిజన సంఘం ఇప్పటికే అధికారులకు 57 సార్లు పిర్యాదు చేసినట్టు తెలిపారు. మండల కేంద్రంలో గిరిజనేతరులు గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తు బహుళ అంతస్తులు నిర్మించుకొంటున్నారు. ఖాళీ స్తలాన్ని వదలకుండా ఆక్రమించు కొంటున్నారన్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి మరచి పోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో మీ కోసంలో 57వ సారి పిర్యాదు అందజేసారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లింగమూర్తి, నరసింహమూర్తి, అనంత్ కుమార్, ఆనంద్, బిబి ప్రసాద్, కొండలరావు పాల్గొన్నారు.



ఫిర్యాదు పత్రాన్ని ఇస్తున్న నాయకులు, గ్రామస్తులు

ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు

సిపిఎం నేతలు బొప్పెన కిరణ్, పి.అప్పలనర్స



పాడేరులో నివాళులర్పిస్తున్న అప్పలనర్స, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సంతాప సభలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, నాయకులు మట్ల వాణిశ్రీ, ఈతపల్లి సిరిమల్లి రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కిరణ్, వాణిశ్రీ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్రణ వేసుకున్న నేత ఏచూరి అని పేర్కొన్నారు. 2024 ఎన్నికలలో బిజెపియేతర పార్టీలను ఒక తాటిపైకి తీసుకొని వచ్చి ఇండియా వేదిక ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు ఏచూరి అడుగుజాడల్లో నడుస్తూ పోరాటాలద్వారా ఆయన స్ఫూర్తిని నిలబెట్టాలన్నారు.

విఆర్.పురం : సీతారాం ఏచూరి నిబద్ధత గల మార్క్సిస్టు మేధావి అని సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు అన్నారు. శుక్రవారం స్థానిక బొప్పెన భీమయ్య భవనం వద్ద సిపిఎం నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సున్నం రాజులు మాస్టర్, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, సోడి మల్లయ్య, లక్ష్మయ్య, జి. లక్ష్మణరావు, ఖాదర్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

కూనవరం : స్థానిక మార్తా శ్రీరామ్మూర్తి భవన్‌లో సీపీఎం నాయకులు, ప్రజా ప్రతినిధులు సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఎంపీటీసీలు జయసుధ, అమ్మాజీ, సర్పంచులు నాగమణి, వెంకమ్మ, శంకర్, తలగాని నాగరాజు, గడ్డిపాటి షణ్ముకేశ్వరావు, ఆవుల ఉపేంద్ర, మురళి, తాళ్లూరి శ్రీనివాసరావు, పాయం సత్యనారాయణ, సునీత, ఈశ్వర్లు, బాబురావు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని ఎర్రబోరులో పులుసు బాలకృష్ణ అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. తొలుత ఏచూరి చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని బలోపేతం చేయడమే ఏచూరికి ఇచ్చే నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఇరపా అజయ్, కాక అర్జున్, ఐ పద్మ, పొడియం రత్తమ్మ, సోయం వీరమ్మ, కారం జయమ్మ, హుస్సేన్, హరనాథ్ పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, ముర్రం రంగమ్మ, పూలమాల వేశారు. నాయకులందరూ నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు మల్లం సుబ్బమ్మ, మడకం చిన్నయ్య, మొట్టం రాజయ్య, చింతా రాంబాబు, సుబ్బారావు, నాగార్జున, నంద, దుర్గారావు, వేక రాజ్ కుమార్, లెనిన్, పల్లపు రాములు, కారం రాజయ్య పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి మండల పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. అరుకు సంతబయలులో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్పీ పోతురాజు మాట్లాడుతూ, సీతారా ఏచూరి కార్మిక, కర్షక, రైతుల బడుగు బలహీన వర్గాల గుండెచప్పుడు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గసభ పంచాయతీ సర్పంచ్ పి.సునీత, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, సిపిఎం నాయకులు టి.సూర్యనారాయణ, వార్డు సభ్యులు పి సత్యనారాయణ, గోపాల్, మత్తు, రామచందర్, మోహన్ దాస్, ధర్మారావు పాల్గొన్నారు.

పాడేరు : కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస తెలిపారు. సి.పి ఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పల నరస మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి ఎంతో తపనతో ప్రభుత్వాలకు సూచనలు చేశారన్నారు. అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీ నాయకులతో ఆయనకు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రచార సభ సందర్భంగా కూనవరంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారని పేర్కొన్నారు.

పెదబయలు: సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారం ఏచూరికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సన్నిబాబు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కే.శర్బన్న, గంగాధరం, ప్రసాద్ పాల్గొన్నారు.



రంపచోడవరంలో నివాళులర్పిస్తున్న బొప్పెన కిరణ్, వాణిశ్రీ, ఇతర నాయకులు

పేదల జీవన ప్రమాణాల మెరుగుకు సహకరించాలి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పేదల జీవన ప్రమాణాల మెరుగుకు బ్యాంకులు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో ప్రత్యేక డిస్ట్రిక్ట్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సందర్భంగా ఇటీవల వరుసగా వస్తున్న వరదలు, వాసలకు జిల్లా ప్రజలకు, రైతాంగానికి కలిగిన నష్టాలను వివరించారు. పంటలు నష్టపోయిన రైతులకు బ్యాంకులు రుణాలు అందించి ఆదుకోవాలని సూచించారు. రహదారుల భవనాల శాఖ రోడ్లు 30 కిలో మీటర్ల మేరకు నష్టం వాటిల్లిందని, 37 కల్వర్టులు దెబ్బతిన్నాయని వాటి మరమ్మతులకు, నిర్మాణాలకు రూ.450 కోట్ల మేరకు అవసరమవుతుందన్నారు. పంచాయతీ రాజ్ రోడ్లు 25 కిలో మీటర్ల వరకు శిధిలమై పోయాయని రూ.153.78 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. 320 గృహాలకు నష్టం జరిగిందన్నారు. గృహాలకు రూ.1.19 లక్షలు నష్టపరిహారం అందిస్తామన్నారు. పూరిళ్ల రెండు దెబ్బతిన్నాయని వాటికి రూ.16 వేల చొప్పున పరిహారం అందించామన్నారు. చింతూరు డివిజన్ పరిధిలోని 800 కుటుంబాలని సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేసామని స్పష్టం చేసారు. పశువులు 7, గొర్రెలు మేకలు 89, కోళ్లు 150 వరకు మతి చెందాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. 33 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 150 వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించామన్నారు. మత్స్యకారులకు సంఘాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా చేపల పెంపకం చేపట్టాలని చెప్పారు. రిజర్వాయర్లలో కేజ్ కల్చర్ ఏర్పాటు చేస్తే మత్స్యకారులకు లాభదాయక మన్నారు. అదే విధంగా మార్కెటింగ్ సదుపాయలు కల్పించాలని సూచించారు.పర్చువల్ విధానంలో పాడేరు ఐటిడిఏ పి.ఓ. వి. అభిషేక్, రంపచోడవరం పి.ఓ కె.సింహాచలం, యూబిఐ రీజనల్ మేనేజర్ పి.నరేష్, అభిషేక్, ఎపిజివిబి శరత్ చంద్ర, డిసిసిబిసి. ఇఓ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి నంద్, నాబార్డు డిడి ఎం రావూరి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

నులిపురుగులను నిర్మూలిద్దాం

పాడేరు : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. 6 నెలలకు ఒక మోతాదు మాత్రలను విద్యార్థులు అందించడంతో రక్తహీనతను నిర్మూలించ వచ్చని జిల్లా కలెక్టర్ శ్రీ దినేష్ కుమార్ పేర్కొన్నారు శుక్రవారం పాడేరు కలెక్టరేట్ భవనంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఈ నెల 17 వ తేదీన నిర్వహించి, ఆల్బెండజైజ్ మాత్రలను వేయాలన్నారు. పిల్లలు, కిశోర బాలబాలికల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనతతో నీరసంగా ఉంటారన్నారు. 335190 మంది విద్యార్థినీ విద్యార్థులు అందించనున్నట్లు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమల్ భాషా, డీ.యస్.ఓ కైలాష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



చెత్తాచెదారంతో ఉన్న సంత

అపారిశుధ్యంగా వారపు సంత

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో చెత్తచెదారం పేరుకు పోయి ఉండడంతో అపరిశుధ్యంగా దర్శనమిస్తుంది. దీంతో, సంతకు వచ్చిన గిరిజనులు పలు ఇబ్బందులు పడుతున్నారు. వారపు సంతలోని సంత షెడ్డు పరిసరాల్లో ప్లాస్టిక్ బాటిల్లు, కవర్లు పెరిగిపోయి ఉండగా, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో అపారిశుద్ధ్యంగా మారింది. దీంతో సంత షెడ్ల పరిసరాల్లో కూరగాయలు విక్రయించ డానికి, నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి వెళ్లిన గిరిజనులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి వారపు సంతలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

రాజ్మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి: రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కిటుముల సర్పంచ్ జి రమణమ్మ కోరారు. కిటుముల గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ఆ పంచాయతీ ఎంపీటీసీ పద్మ ఆధ్వర్యంలో రాజ్మా విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి తగు సూచనలు, సలహాలు చేశారు. గంజాయి సాగు, రవాణా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రాజ్మా సాగు చేపట్టి అధిక దిగుబడి సాధించి గౌరవప్రదంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సీనియర్ నాయకులు వనము పోతురాజు, సన్యాసిరావు, లోవరాజు, ఆర్బికే శ్రీరామ్, కూటమి నాయకులు పాల్గొన్నారు



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

వాగులపై వంతెనలు నిర్మించాలి

గిరిజన సంఘం మండల కార్యదర్శి చంటిబాబు, గిరిజనులు



ప్రమాదకరమైన వాగు దాటుతున్న గొల్లపల్లి, పెబ్బంపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి -సీలేరు

వాగులపై వంతెనలు లేకపోవడంతో వర్షా కాలంలో గిరిజనలు ప్రాణాలకు తెగించి వాగులు దాటాల్సిన దుస్థితి నెలకొందని, వాగులపై వంతెలు నిర్మించాలనిఏపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి చంటిబాబు డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం అమ్మోరు దారకొండ పంచాయతీకి చెందిన గొల్లపల్లి, పెబ్బంపల్లి గ్రామస్తులు నిత్యవసర సరుకులు కావాలన్నా, వైద్య సేవలు పొందాలన్నా వాగు దాటి వెళ్ళవలసి ఉందని, వాగుపై వంతెన లేకపోవడంతో ఆయా గ్రామస్తులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రాణాలు ఫణంగా పెట్టి వాగు దాటుతున్న పరిస్థితులు కనిపించాయని చెప్పారు. అయినా అధికారులు వంతెన నిర్మించడానికి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. సిరిబాల మెయిన్ రోడ్డు నుంచి చామగెడ్డ గ్రామం మీదగా అమ్మవారి దారకొండ పంచాయతీ గొల్లపల్లి పెబ్బంపల్లి గ్రామం వరకు సుమారు 20 కిలోమీటర్లు రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నామని వాపోయారు. బీటి రోడ్డు రహదారి మధ్యలో రెండు వంతెనలు వేయమని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మార్గం తప్ప ఆ గ్రామాలకు వేరే మార్గం లేదని, నిత్యవసర సరుకులు, గర్భిణీ స్త్రీలు ప్రసవ సమయంలో అరిచేతులో ప్రాణాలు పెట్టుకుని వాగులు దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటిడిపిఓ అభిషేక్ స్పందించి తమ గ్రామానికి రహదారి వంతెనలు తక్షణమే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశా వర్కరు అలివేలును కొనసాగించాలి

వడ్డిగూడెం బిసి కాలనీ వాసుల డిమాండ్

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ బీసీ కాలనీలో 25 సంవత్సరాలు నుండి ఆశా వర్కరుగా పని చేస్తున్న ఉంగుటూరు అలివేలును కొనసాగించాలని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బిసి కాలనీలో 370 కుటుంబాలు నివాసముంటున్నాయని, తమకు గత 25 సంవత్సరాల నుండి ఉంగుటూరు అలివేలు ఆశా వర్కరుగా ఉత్తమ సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ గ్రామంలోని గర్భిణులు, రోగులను తన సొంత వాహనంలో అర్ధరాత్రి అయిన ఆసుపత్రికి తీసుకొని వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ప్రతి రోజూ పరామర్శి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ, అవసరమైన మందులు ఇస్తూ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వరదల సమయంలో గర్భిణులను ముందు జాగ్రత్త చర్యగా ఆమె సొంత ఖర్చులతో ఆస్పత్రికి తరలించేవారని, కరోనా సమయంలో అందరూ బయటకు రావడానికి భయపడితే ఆమె మాత్రం కరోనాను లెక్కచేయకుండా ఇంటింటికి తిరిగి అందరికీ ముందు జాగ్రత్తలు చెప్పేవారని గుర్తు చేశారు. అయితే అలివేలును తమ గ్రామం నుండి మార్చాలని కొందరు చూస్తున్నారని, అది సరికాదని పేర్కొన్నారు. తమ కాలనీకి ఆమె సేవ ఎంతో అవసరం ఉందని, తమ గ్రామంలోని 370 కుటుంబాలు అలివేలును ఆశా వర్కరుగా ఉంచాలని కోరుతున్నారని తెలిపారు. ఈ మేరకు గ్రామసభ తీర్మానాన్ని డిఎంహెచ్ఓ, రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్‌కు పంపించనున్నట్లు చెప్పారు. గ్రామసభలో స్థానికులు ఎం. లక్ష్మి, యశోద, ఆర్. సంధ్యారాణి, వై. సత్యావతి, బి జగదీష్, బి కళావతి, నాగుల ముత్యాలరావు, నరసింహారావు, ఎం. మణి, ఎం. సాయి లక్ష్మి సత్యవతి, బాలాజీ, హరిబాబు, ఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న వడ్డిగూడెం బిసి కాలనీ వాసులు

19న పాడేరులో జాబ్ మేళా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 19న పాడేరులో నిర్వహిస్తున్న జాబ్ మేళా గోడపత్రికను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, డిఆర్‌డిఎ పి డి మురళి, ఎల్‌డిఎం నాయుడు శుక్రవారం కలెక్టరేట్లో ఆవిష్కరించారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివఋద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం, సీ డాప్ సంయుక్త ఆధ్వర్యంలో జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలెజీ పాడేరులో 19న గురువారం ఉదయం 10గం.ల నుండి సాయంత్రం 4గంట.ల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ శుక్రవారం ఈ ప్రకటన లో తెలిపారు. జిల్లాలోని 18 సంవత్సరాల నుండి 30 ఏళ్ల మధ్య గల టెన్త్ క్లాస్, ఇంటర్మీడియట్, డిప్లొమా ,డిగ్రీ, బి.టెక్ పై చదువు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు పాన్, ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10వేలు నుండి రూ.20 వేలు వరకు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ లేదా 6302636174, 9398338105 సంప్రదించాలన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెబ్సైటును పరిశీలించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడి ఏ కార్యాలయంలో ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్ తో కలిసి మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీదారుల నుండి 89 వినతి పత్రాలను స్వీకరించారు. ప్రతీ రోజు అధికారులు ఉదయం, సాయంత్రం పి.జి.ఆర్.ఎస్. వెబ్సైట్ను సందర్శించి ఫిర్యాదులను పరిశీలించాలని ఆదేశించారు. డుంబ్రిగుడ మండలం పోతంగి సర్పంచ్ వంతల వెంకటరావు చాపరాయి గెడ్డపైన, కోసంగి గెడ్డపై చెంపపట్టి వద్ద వంతెనల నిర్మాణాలు చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం లగిశపల్లి గ్రామస్తులు అడపా కాంతమ్మ, మసాడ బాలమ్మి, ఎం.నాగరాజు తదితరులు కాఫీ బోర్డు నుండి సిమెంటు కల్లాలు మంజూరు చేయడానికి పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. జి.మాడుగుల మండలం పెదలువ్వాసింగ్ సెగ్మెంటు ఎం.పి.టి.సి గబ్బడి సన్యాతి దొర బొండ పల్లి గ్రామం బిటి రోడ్డు నుండి అలగల గ్రామం వరకు బిటి రోడ్డు నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ బి.పద్మావతి, ఎస్డీసి వివిఎస్.శర్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి . జమాల్ భాషా, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు కె. వేణుగోపాల్, డివిఆర్ఎం. రాజు, డి.పి.ఓ కొండలరావు, గిరిజన సంక్షేమశాఖ డిడి. ఐ.కొండల రావు, ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమలత, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా పాపినాయుడు


ఎస్ఐ పాపినాయుడు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండల నూతన ఎస్సైగా పాపి నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండలంలో పనిచేస్తున్న ఎస్ఐ సంతోష్ కుమార్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై పాపినాయుడు మాట్లాడుతూ, మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

వారపు సంతలో నకిలీ విత్తనాల జోరు

● మోసపోతున్న గిరిజన రైతులు ● పట్టించుకోని అధికారులు


వారపు సంతలో విక్రయిస్తున్న విత్తనాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : వ్యవసాయ రైతులు నష్టపోకుండా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది రాయితీతో నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేస్తుంది. దీంతోపాటు బయట ప్రైవేట్‌లో విక్రయించాలన్నా ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా చేసింది. ప్రభుత్వ అనుమతితోనే బయట కూడా కూరగాయలతో పాటు ఇతర విత్తనాలు విక్రయించాల్సి ఉంది. కానీ ఇక్కడి గిరిజన ప్రాంతంలోని వారపు సంతల్లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కూరగాయలు, రాజ్ మా, ఢిల్లీ పిక్కలతో పాటు పలు రకాల అపరాల విత్తనాలను విక్రయిస్తున్నారు. నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి వ్యవసాయ పంటలు సాగు చేసిన రైతులు పంటలు సరిగా పండక పోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

మండలంలోని అరకు వారపు సంతలో దుకాణాలు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు. వీటితోపాటు అరకు వారపు సంత తో పాటు కించమండ వారపు సంతలో, మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో విచ్చలవిడిగాఅధిక ధరలతో ఎరువులను సైతం విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరబడటంతో విచ్చలవిడిగా ప్రైవేటు వ్యాపారులు నకిలీ విత్తనాలను విక్రయిస్తూ లాభార్జన చేసుకుంటున్నారు. వీటిని కొనుగోలు చేసి వ్యవసాయం సాగు చేసిన గిరి రైతులు పంటలు కోల్పోయి ఆర్థికంగా కుదేలు అవుతున్నామని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వారపు సంతల్లో విక్రయిస్తున్న నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలని గిరి రైతులు కోరుతున్నారు.

ఔషధ ప్రయోగాలకు ప్రత్యామ్నాయం అవసరం

గీతం ఫార్మశీ వర్క్‌షాప్‌లో నిపుణుల సూచన



మాట్లాడుతున్న డాక్టర్ కులకర్ణి

ప్రజాశక్తి- మధురవాడ : కృత్రిమ మేధ, కంప్యూటర్ టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత కాలంలో ఔషధ పరిశోధనలకు జంతువులను ఉపయోగించడం కంటే ఇతర మార్గాలపై దృష్టి పెట్టాలని వ్యాస్ కేన్సర్ రీసెర్చి పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టర్, సీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ మందర్ కులకర్ణి సూచించారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ జంతువులపై ప్రయోగాలకు ప్రస్తుత కాలంలో సామాజిక వ్యతిరేకత ఉందని, దీని దృష్ట్యా నైతిక విలువలను పాటిస్తూ శాస్త్ర పరిశోధనలు జరగాలన్నారు. జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ ఔషధ ప్రయోగాలకు జంతువులకు ప్రత్యామ్నాయం లేదని, పరిశోధన ఫలితాలకు జంతువులను వాడే సమయంలో విధిగా నిబంధనలను పాటించాలని, నైపుణ్యాలతో వ్యవహరించాలని సూచించారు. భారత ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ సీనియర్ నిపుణులు డాక్టర్ వివేక్ త్యాగి మాట్లాడుతూ దేశంలో ఔషధ పరిశోధనల సంఖ్య క్రమేపి పెరుగుతోందని, ఏటా దాదాపు 600 పెద్ద జంతువులపై ప్రయోగాలకు పరిశోధకులు అనుమతులు పొందుతున్నారన్నారు. జంతువులపై ఔషధ ప్రయోగాలు జరిపే సమయంలో వాటి సంరక్షణ సరిగా లేకుంటే అవి తీవ్ర ఒత్తిళ్లకు గురవుతాయని, పరిశోధన ఫలితాలలో ఆ మార్పు కనబడుతుందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గీతం ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాజా, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ జి.సుహాసిన్ పాల్గొన్నారు. దేశంలోని ప్రముఖ పరిశోధన కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.హరిశంకర్, డాక్టర్ ఎమ్.జె.మహేష్‌కుమార్, డాక్టర్ ప్రాంజలి మిలింద్ పోర్ పాల్గొని వివిధ అంశాలపై మాట్లాడారు.

ఐహెచ్‌ఆర్‌సి తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా మేజర్ ఉషాదేవి

ప్రజాశక్తి- వేపగుంట : ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ (ఐహెచ్‌ఆర్‌సి) ఆంధ్రా, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా ఆర్మీ మెడికల్ సర్వీస్ మాజీ మేజర్ పి ఉషాదేవి నియమితులయ్యారు. శుక్రవారం జివిఎంసి:93వ వార్డు కృష్ణానగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు మేజర్ ఉషాదేవికి సంస్థ వ్యవస్థాపక జాతీయ చైర్మన్ రాజాన ప్రసాదరావు నియామకపత్రం, గుర్తింపుకార్డు అందజేశారు.ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, ఆర్మీ మెడికల్‌లో సేవలు అందించిన ఉషాదేవి, ఇపుడు సంస్థ తరపున ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావంతో పనిచేయాలని, మానవహక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎన్ రవివర్మ, కన్వీనర్ పి మురళి ట్రెజరర్ ఆర్ విజయ, సెక్రటరీ ఇషిత, విశాఖ జిల్లా ప్రెసిడెంట్ జి శ్రీనివాస్, జిల్లా మహిళాధ్యక్షురాలు పి హేమలత, ఉమాదేవి పాల్గొన్నారు

50 కిలోల గంజాయి పట్టివేత


మాట్లాడుతున్న సీఐ ఎల్ హిమగిరి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కారులో తరలిస్తున్న 50 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి తెలిపారు. శుక్రవారం అరకులోయలోని ఎస్సై సంతోష్‌తో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అరకులోయ మండలం పద్మాపురం పంచాయితీ రాజధాని జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒరిస్సా నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారును తనిఖీ చేశామన్నారు. 50 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుండి ఒక సెల్ ఫోన్, కారు, బండి నెంబర్ ప్లేట్ స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నకిలీ కారు బండి నెంబర్ బోర్డు పెట్టి గంజాయి తరలిస్తుండేవారని అన్నారు. కేసు నమోదు చేసి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

శిథిలమైన బావిని పూడ్చేయాలి


వినతి పత్రం అందిస్తున్న సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : మండలం కేంద్రంలో గురుకుల కళాశాల, పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న బావిని పూడ్చాలని సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, గ్రామస్తులు మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత ఏడాది వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరిన బావితో మూగజీవాలు, కళాశాల విద్యార్థులకు ప్రాణ శంకటంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. పలుమార్లు పిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జె.ప్రభాకరరావు, జంబు, కొటిబాబు, జెండా రామారావు, కూడా కృష్ణబాబు, గూబరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు

అగ్గిదొర మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి - చింతపల్లి : సిపిఐ మండల సమితి సభ్యుడు సీందేరి అగ్గి దొర మరణం మన్య ప్రాంతంలో పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. మండలంలోని లంబసింగి పంచాయతీ భీమనాపల్లి గ్రామంలో మరణించిన సిపిఐ నేత సిందేరి అగ్గిదొర పార్థివదేహానికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు.


వడ్డిగూడెంలో జోరుగా సాగుతున్న పారిశుధ్య పనులు

ముంపు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని ముంపునకు గురైన వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ ధర్మతాలగూడెం గ్రామాల్లో వరద తగ్గడంతో సర్పంచ్ సోడి నరసమ్మ, పంచాయతీ కార్యదర్శి స్వరూప రెడ్డి శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలు తగ్గుముఖం పట్టడంతో గుడారాల నుండి ప్రజలు ఇళ్లకు వస్తున్నారని, గృహాల్లో విష పురుగులు చేరే అవకాశం ఉందని తెలిపారు. దోమకాటు కూడా ఎక్కువగా ఉంటుందని, అంటువ్యాధులు ప్రబల కుండా ముందు జాగ్రత్త చర్యగా పారిశుధ్య కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం : గోదావరి వరదల నేపథ్యంలో పునరావాస కేంద్రాలకు వలసలు వెళ్లిన వరద బాధితులు టేకులబోరు, కూనవరం గ్రామాలకు చేరుకుంటున్నారు. పంచాయతీ మొత్తం అపరిశుభ్రంగా ఉండడంతో మేజర్ పంచాయితీలో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. స్థానిక సర్పంచ్ హేమంత్, కార్యదర్శి సురేష్ పంచాయితీ సిబ్బందితో కలిసి శుక్రవారం పనులను పరిశీలించారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న జాన్ రాజ్


రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సిబ్బంది వైద్య సేవలు అందజేయాలని మండల ప్రత్యేక అధికారి జాన్ రాజ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక పీహెచ్సీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పీహెచ్సీలో రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రులలో ల్యాబ్ పరిశీలించి రక్తం నమూనాలు సేకరణ పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రోగులకు అన్ని పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణీలు బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తాహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, పీహెచ్ వైద్యాధికారి సుష్మ, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు ప్రధాన రహదారి క్లియరెన్స్ పనులు పూర్తి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం లంకపాకల నుంచి సీలేరు వరకు ప్రధాన రహదారి క్లియరెన్స్ పనులు పూర్తయినట్లు ఆర్ అండ్ బి ఈఈ బాల సుందరబాబు వెల్లడించారు. లంకపాకల నుంచి సీలేరు వరకు రహదారి క్లియరెన్స్ పనులు శుక్రవారం క్షుణ్ణంగా ఆయన పరిశీలించారు. సీలేరు చేరుకుని దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ తాత్కాలిక మరమ్మతు పనులు పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలకు లంకపాక నుంచి సప్పర్ల వరకు, దారకొండ ఘాట్ రోడ్‌లో అనేక చోట్ల, దుప్పిలివాడ పంచాయతీ చల్లని శిల్ప నుంచి సీలేరు వరకు ప్రధాన రహదారులో సుమారు పదిచోట్ల కొండ చరియలు విరిగిపడి రవాణా సౌకర్యం తీవ్ర అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. కలెక్టర్ పిఓ ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన జెసిబిల సహాయంతో సోమవారం నుంచి శుక్రవారం వరకు రాత్రి పగలు రహదారి క్లియరెన్స్ చేపట్టి పూర్తి చేశామని వెల్లడించారు. ప్రస్తుతం సీలేరు నుంచి చింతపల్లి వరకు అంబులెన్స్‌లు, కార్లు ద్విచక్ర వాహనాలు, ఆటోలు రవాణా సౌకర్యానికి ఎటువంటి అంతరాయం ఉండదని తెలిపారు. లంకపాకల - సంపంగ గొంది మధ్యలో రెండు వంతెనలు పూర్తిగా ముందు భాగం కొట్టుకుపోయి గాల్లో వేలాడుతూ దెబ్బతిన్నాయని, వంతెన కింది భాగంలో కర్రలు సపోర్ట్ పెట్టి పైనుంచి వాహనాలు వచ్చేలా ఏర్పాటు చేశామన్నారు. ఈ వంతెనలు పైనుంచి బస్సులు వచ్చిన ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తాత్కాలికంగా వంతెన కింద భాగంలో ఇసుక సిమెంట్ కలిపిన బస్తాలను సపోర్టుగా అమర్చడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మరో రెండు రోజుల్లో ఆర్టీసీ బస్సులు తిరిగేలా వంతెనలు తాత్కాలిక మరమ్మతు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. సీలేరు నుంచి రాజమండ్రి, విజయవాడ, భద్రాచలం బస్సులు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వలస గెడ్డ వంతెన వరద కోతకి గురైన ఇరువైపులా తాత్కాలిక మరమ్మతు పనులు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిఇ రామారావు, జేఈలు ప్రసాదరావు, భరత్ కాంట్రాక్టు పిలోన్ పాల్గొన్నారు.


రహదారి క్లియరెన్స్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీలో అందించే పౌష్టికాహారం ద్వారా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సిడిపిఓ సీడీపిఓ దేవామణి అన్నారు. శుక్రవారం రాజవొమ్మంగి సెక్టార్ లెవెల్ పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు వండితీసుకొచ్చిన పౌష్టికహార వంటలను ఎంపిపి, సర్పంచ్, గ్రామ పెద్దలు రుచి చూసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి రాగి హల్వా కన్నయమ్మ పేట అంగన్వాడీ టీచర్ ఎర్రయమ్మకు, రెండవ ప్రైజ్ బీట్ రూట్ హల్వా చేసిన ఎర్రంపాడు అంగన్వాడీ టీచర్ అరుణ కుమారికి, మూడవ ప్రైజ్ బాలామృతం హల్వా చేసిన రాజవొమ్మంగి -3 అంగన్వాడీ టీచర్ కె.నూకరత్నంకు అందజేశారు.

ఏడుగురు గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి రమణి, సీహెచ్ ఓ రామారావు, వార్డ్ సభ్యులు దేవి, సావిత్రి, లోవకుమారి, వెలుగు సీసీ నిర్మల, సెక్టార్ సూపర్ వైజర్ అరుణ లత, వైద్య సిబ్బంది రత్న కుమారి, సత్యవతి, భవానణి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సిఎం సహాయ నిధికి విశాఖ పోర్టు రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయవాడలో వరద ప్రభావిత ప్రాంత ప్రజల సహాయార్థం విశాఖపట్నం పోర్టు అథారిటీ కోటి రూపాయలను విరాళంగా ఇచ్చింది. ఈ మేరకు పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజానికి అవసరమైనపుడు సహాయ సహకారాలు అందించడంలో విశాఖ పోర్ట్ యాజమాన్యం, సిబ్బంది ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారన్నారు. విజయవాడ వరదలకు సంబంధించి ఈ నెల 9న పోర్ట్ కార్మిక సంఘాలు, అధికారుల సంఘాలతో చర్చించి వరద బాధితుల కోసం ఒక రోజు వేతనాన్ని సిఎం సహాయ నిధికి అందించాలని నిర్ణయించామన్నారు. కార్మిక సంఘాలు ఒక రోజు బేసిక్ వేతనాన్ని విరాళంగా ఇవ్వడానికి అంగీకరించగా, అధికారుల సంఘం ఒక రోజు బేసిక్ వేతనం, ఒక రోజు డిఎ ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. రూ.45,81,770ను సిబ్బంది, అధికారుల నుంచి, రూ.54,18,230ను సిఎస్ఆర్ నిధి నుంచి వెరసి మొత్తం కోటి రూపాయలను అందించామన్నారు.


నిత్యావసరాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీషా దేవి తదితరులు

ముంపు బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఇప్పురు, గుండుగూడెం, పునరావాస కేంద్రాలలో పాకలు వేసుకున్న ధర్మాతాళ్ళ గూడెం, కోటరి గోమ్ము గ్రామం మొత్తం 4 గ్రామాలకు చెందిన 284 కుటుంబాలకు ఎఎస్‌డిఎస్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి పది కేజీల బియ్యం, మూడు కేజీల కందిపప్పు, బెడ్ షీట్స్, టవల్స్,దుప్పట్లు, దిండ్లు, రెండు సంచులు ఉన్న కిట్స్ ఎమ్మెల్యే శిరీషా దేవి, గాంధీ బాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎమ్ఆర్ఓ సుబ్బారావు, ఎమ్‌డిఓ, సిఐ కన్నాపురాజు , ఎఎస్‌డిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : వరదలో నిరాశ్రయులైన బాదిత కుటుంబాలకు దారకొండ యూత్ నిత్యవసర సరుకులు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. జీకే వీధి మండలం దారకొండ పంచాయితీ నిమ్మచెట్టు గ్రామంలో భారీ వర్షాలు వరద తాకిడికి కొండచరియలు, బురద రాళ్లు, పెద్ద పెద్ద చెట్లు కొట్టుకు రావడంతో ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంటిలోకి వరద నీరు చొరబడిపోవడంతో నిత్యవసర సరుకులు తిండి సామాగ్రి దినుసులు పూర్తిగా తడిసి పాడైపోయాయి. తినడానికి తిండి గింజలు లేక ఆ గ్రామ ప్రజలు దయనీస్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న ధారకొండ యూత్ ముందుకొచ్చి నిత్యవసర సరుకులు పంపిణీ చేసి కొంతమేరకు ఆదుకున్నారు. వెంటనే అధికారులు స్పందించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆ గ్రామ నిర్వాసితులకు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు సి. సురేష్ దమయంతి, నాగేశ్వరరావు గొర్రెల, ఉమామహేశ్వరరావు, కొర్ర దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వాగులో దుంగల తొలగింపు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం బొడ్లంక గ్రామ సమీపాన ఉన్న పెళ్లి రేపు కొండ వాగులో ఉన్న దుంగలను శుక్రవారం తొలగించారు. గత రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో కొండ కాలువలు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్ద పెద్ద దుంగల, చెత్తాచెదారం కొట్టుకురావడంతో బ్రిడ్జి పైనుండి వాహనాలు నేటికీ రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గుర్తేడు సర్పంచ్ దుష్యంతుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి జెసిబిని పంపించి కాలువలో ఉన్న చెత్తాచెదారం దుంగలను తొలగించారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులు పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఎంవిపి.కాలనీలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌లు సంయుక్తంగా పాఠశాల సమావేశ మందిరంలో శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాత్రపై అవగాహనా కార్యక్రమం చేపట్టాయి. స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్.వరలక్ష్మి అధ్యక్షత వహించారు. విద్యార్థుల ఫిర్యాదుల బాక్స్‌ను విద్యార్థినుల చేతులు మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి అప్పారావు, సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది బాలల హక్కుల పరిరక్షణలో బాధ్యతతో కూడిన కీలక పాత్రధారులు, సూత్రధారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. తమ కమిషన్‌కి అందుతున్న ఫిర్యాదుల్లో ఉపాధ్యాయులు, స్కూల్ వాచ్‌మ్యాన్లు, డ్రైవర్లు, కండక్టర్లు తదితర సిబ్బందిపై అనేక ఆరోపణలు ఉంటున్నాయన్నారు.